రేపటి వరకే 'ప్రజాపాలన'

- బస్తీల్లో భారీగా దరఖాస్తు చేసుకుంటున్న స్థానికులు
- నిరక్షరాసుల కోసం ప్రత్యేకంగా వలంటీర్లు
- కాలనీల్లో మిశ్రమ స్పందన
- కొన్నిచోట్ల పార్టీలకు చెందిన కార్యకర్తల టేబుళ్లు


గౌతంనగర్‌లో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

బంజారాహిల్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో ఐదు గ్యారంటీల కోసం దరఖాస్తు స్వీకరణకు మరో రెండు రోజులే మిగిలి ఉంది. దీంతో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో సమయం దగ్గర పడుతున్నకొద్దీ ప్రజాపాలన కేంద్రాల వద్ద దరఖాస్తుదారుల సంఖ్య పెరుగుతోంది. ఐదు గ్యారంటీలకు తాము లబ్ధిదారులం కావాలనే ఆరాటంతో బస్తీవాసులు వార్డు, కమ్యూనిటీ హాళ్ల వద్ద బారులు తీరుతున్నారు.

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంకటేశ్వరనగర్‌కాలనీ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ డివిజన్‌లలో బస్తీల్లోని దరఖాస్తు కేంద్రాలకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. జూబ్లీహిల్స్‌లోని వార్డు కార్యాలయంలో సుమారు నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాల వద్ద ఫిలింనగర్ వివిధ బస్తీలకు చెందిన వారు దరఖాస్తులు అందజేస్తున్నారు. ఇందిరానగర్ కమ్యూనిటీ హాల్‌లో కూడా కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. ఫిలింనగర్ గౌతంనగర్‌లో ఏర్పాటు చేసిన కేంద్రం దరఖాస్తుదారులతో కిటకిటలాడుతోంది. కొన్ని సందర్భాల్లో దరఖాస్తు ఫారాలు అయిపోతే అధికారులు తిరిగి తెప్పించి మరీ అందజేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12 ఎన్‌బీటీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో మూడు కేంద్రాలను అందుబాటులో తేగా అన్నిట్లో కూడా దరఖాస్తుదారుల సందడి కనిపించింది. ఇక కాలనీల్లో ప్రజాపాలనకు స్పందన తక్కువగా ఉంది. కాలనీవాసులు దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి కనబర్చలేదు. ఎలాగూ అర్హత రాదు. కాబట్టి దరఖాస్తు చేసుకోవడం ఎందుకు అనే ధోరణిలో ఉన్నారు.

రేషన్‌కార్డుకే అధిక వినతులు

ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసమే అధిక వినతులు అందుతున్నాయి. ఐదు గ్యారంటీలకు టిక్ పెట్టడంతోపాటు మెజారిటీ ప్రజలు రేషన్ కార్డు కోసం ప్రత్యేకంగా వినతి పత్రం సమర్పిస్తున్నారు. కొంత మంది తెల్లరేషన్ కార్డు లేదు కదా సంక్షేమ పథకాలు అందుతాయా అంటూ అధికారులను అడుగుతున్నారు. గతంలో ఎవరూ రేషన్‌కార్డులు ఇవ్వలేదు. ఇప్పుడేమో పథకాలు అందేలా లేవని జ్ఞానిజైల్‌సింగ్‌నగర్‌కు చెందిన సుగుణ పేర్కొంది. పేదలకు ఎప్పుడు పథకాలు అందాలన్నా ఏదో ఒక్క మెలిక ఉంటుందని ఆమె తెలిపారు. పింఛన్ కోసం గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకోగా ఎవరూ పట్టించుకోలేదని, ఇప్పుడైనా వస్తదో రాదో అని రాములక్క అనే వృద్ధురాలు వాపోయింది. గడిచిన ఐదు సంవత్సరాల్లో వృద్ధాప్య పింఛన్ కోసం ఎనిమిది మార్లు అధికారులకు దరఖాస్తు అందచేసినట్టు ఆమె చెప్పారు.

వలంటీర్ల సహాయం

దరఖాస్తు నింపేందుకు బస్తీవాసులు, నిరక్షరాస్యులకు ఇబ్బంది కలుగకుండా చదువుకున్న యువతను వలంటీర్లగా నియమించారు. కేంద్రాల వద్ద ప్రత్యేకంగా టేబుల్ వేసుకొని ఈ వలంటీర్లు దరఖాస్తులు నింపి అందజేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారుల విజ్ఞప్తి మేరకు ఉచితంగానే ఈ పని నిర్వహిస్తున్నట్టు వలంటీర్లు చెబుతున్నారు. రేషన్‌కార్డు కోసం లేఖలను వీరే సిద్ధం చేసి అందజేస్తున్నారు. ప్రజాపాలన కేంద్రాల వద్ద జలమండలి ప్రత్యేకంగా మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేసింది.


బంజారాహిల్స్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

జన్‌సంఘ్ నాయకుడు హనుమంతురావు మృతి

కార్వాన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకులు, జన్‌సంఘ్ నాయకులు ఆకుల హనుమంతురావు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు పాండు యాదవ్ తదితరులు సంతాపం తెలిపారు. నేడు లంగర్‌హౌజ్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరగనున్నట్లు కార్వాన్ బీజేపీ కన్వీనర్ గోవర్ధన్ తెలిపారు.

లూయిస్ బ్రెయిలీ జయంతిని అధికారికంగా నిర్వహించాలి


లూయిస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పి.సాయిబాబా, తదితరులు

రాంనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): లూయిస్ బ్రెయిలీ అంధులకు మరో జన్మ ప్రసాదించారని, ఆ మహనీయుని జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి అఖిల భారత దివ్యాంగుల సంక్షేమ సంస్థ జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పి.సాయిబాబా హాజరై లూయిస్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పి.బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు పెద్దోజు రవీంద్రాచారి, నగు నగేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న కంజర్ల లక్ష్మీనారాయణ పార్క్ వాకర్స్ సభ్యులు

వాకర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

సనత్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బీకేగూడలోని కంజర్ల లక్ష్మీనారాయణ పార్క్ వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని కేఎల్ఎన్‌వై పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్‌గౌడ్ తెలిపారు. గురువారం ఉదయం కొత్త సంవత్సరం సందర్భంగా గురువారం ఉదయం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు, యోగా సాధకులు పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్‌లో మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్‌కుమార్ షిండేను మర్యాదపూర్వకంగా కలిసి బాలాజీ జ్ఞాపికను అందజేస్తున్న కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ జాతీయ కార్యదర్శి పీవీ రవిశేఖర్‌రెడ్డి
-బంజారాహిల్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి)


కుటుంబ సభ్యులతో తిరుమల వెళ్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ - బంజారాహిల్స్

ఇళ్లను కూల్చిన గూండాలను జైలుకు పంపిస్తాం

- కాంగ్రెస్ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్


ప్రకాశ్‌నగర్‌లో కూల్చిన పేదల ఇల్లును పరిశీలిస్తున్న కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

బేగంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పేదలను భయభ్రాంతులకు గురిచేసి, ఇళ్లను కూల్చివేసిన ఓపార్టీ గూండాలతోపాటు వారికి సహకరించిన వారిపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. గురువారం పార్టీ నాయకులతో కలిసి ఆయన బేగంపేట ప్రకాశ్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో కూల్చివేసిన పేదల ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఓ రాజకీయపార్టీ అండతో 'గూండాలు మా ఇళ్లను కూల్చివేశారు' అని స్థానికులు ఆయనకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి ఈ ప్రాంతంలో ఉన్న పేదల ఇళ్లను గూండాలు ఇళ్లను కూల్చివేయడం దారుణమన్నారు. ఇప్పటికే నల్లాకనెక్షన్లు, వాటర్ కనెక్షన్లు, విద్యుత్ మీటర్లు, వైర్లు అక్కడ ఉన్నాయన్నారు. ప్రజావాణిలో ఈ విషయం వెలుగులోకి రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వాస్తవ పరిస్థితి తెలుసుకునేందుకు వచ్చానన్నారు. ఇక్కడి పరిస్థితి చూశాక వీరి వాదనలో న్యాయం ఉందన్నారు. ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. ఇళ్లను కూల్చిన, సహకరించిన వారిపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని స్థానికులకు ఆయన భరోసా ఇచ్చారు. అంతేకాకుండా రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయినట్లుగా చూపి, రూ.40 కోట్ల నష్టపరిహారాన్ని కొందరు తీసుకున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై ఒక కమిటీ వేసి విచారణ జరిపిస్తామన్నారు. ఇక్కడ పేదలకు జరిగిన అన్యాయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతానన్నారు. అందరికీ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హసిటోచర్, రమేష్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ఆర్‌పీఎఫ్ కృషి

693 మంది అరెస్టు... రూ.1.97 కోట్ల రైల్వే ఆస్తి స్వాధీనం

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) నేరాల నివారణకు నిరంతరం కృషి చేస్తూనే అక్రమార్కులను అరెస్టు చేసి ప్రయాణికుల్లో విశ్వసనీయత పెంచింది. రైళ్లు, రైల్వేస్టేషన్లలో నేర కార్యకలాపాలను విజయవంతంగా నియంత్రించినట్టు అధికారులు పేర్కొన్నారు. గత ఏడాది రైల్వే వస్తువులు అపహరించిన, ఆస్తులను ఆక్రమించిన 693 మందిని అరెస్టు చేసి రూ.1.97 కోట్ల రైల్వే ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. నడుస్తున్న రైళ్లపై రాళ్లు రువ్వినందుకు 401 కేసులు నమోదు చేసి 327 మందిని అరెస్టు చేశారు. 161 మందిని అరెస్టు చేసి 23.09 కోట్ల విలువైన 3,239 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే రిజర్వేషన్ టిక్కెట్లను అనధికారికంగా విక్రయించినందుకు 261 మందిని అరెస్టు చేసి రూ.2,30,59,680 విలువ చేసే 8770 టిక్కెట్లను రైల్వే రక్షణ దళం స్వాధీనం చేసుకుంది. టికెట్ లేకుండా రిజర్వేషన్ బోగీలో ప్రయాణించిన 702 మంది నుంచి రూ. 1.47 లక్షల జరిమానా వసూలు చేసినట్టు తెలిపారు. ఫుట్‌బోర్డులపై ప్రయాణించినందుకు 627 మందిని పట్టుకున్నారు. టిక్కెట్ లేకుండా ప్రయాణించిన 1903 మంది వద్ద రూ.1.36 లక్షల జరిమానా వసూలు చేశారు. రైళ్లలో ప్రమాదకరమైన పేలుడు పదార్థాలను తీసుకెళ్తున్న 19 మందిని అరెస్టు చేశారు. రైల్వే ప్రాంగణంలో ప్రయాణికుల వస్తువులను దొంగిలించిన 454 మందిని అరెస్టు చేసి 9.36 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

మైనర్‌ను మోసం చేసిన నిందితుడికి పదేళ్ల శిక్ష

రంగారెడ్డి కోర్టులు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో మైనర్‌ను మోసం చేసిన నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 30 వేల జరిమానా, రూ.5 లక్షల నష్టపరిహారం విధిస్తూ పోక్సో కోర్టు తీర్పు వెల్లడించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునిత వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి... గడ్డిఅన్నారానికి చెందిన వినయ్ 16 సంవత్సరాల మైనర్‌ను ప్రేమ, పెళ్లి పేరిట లోబరచుకుని, ఆ తరువాత బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన పోక్సో కోర్టు న్యాయాధికారి ఎం.కే.పద్మావతి నిందితుడికి శిక్ష విధించారు.

కూలీ హత్య కేసులో ఇద్దరి అరెస్టు


సంజీత్‌కుమార్ తివారీ, ఆనంద్‌కుమార్

బంజారాహిల్స్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కూలీ హత్య కేసులో ఇద్దరి నిందితులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్‌రోడ్డు నెంబర్ 14లో ఓ కన్‌స్ట్రక్షన్స్ భారీ నిర్మాణాలు చేపడుతోంది. ఇదేప్రాంతానికి చెందిన రాజేష్‌కుమార్ కాంట్రాక్ట్ లేబర్‌గా చేరాడు. మూడు నెలల క్రితం అతని బంధువు పంకజ్ కుమార్ కూడా కూలీకి చేరాడు. ఈనెల 1న నిర్మాణ సంస్థలో పనిచేస్తున్న మరికొంత మందితో కలిసి రాజేష్, పంకజ్‌లు మద్యం తాగారు. మత్తులో వారి మధ్య చిన్నగొడవ జరిగింది. నిర్మాణ సంస్థలో పనిచేసే సెక్యూరిటీ గార్డులు ఆనంద్‌కుమార్, సంజీత్‌తివారీ వారి గదికి వచ్చారు. రాజేష్, పంకజ్‌ను బయటకు తీసుకువచ్చి కర్రలతో కొట్టారు. దెబ్బలు తాళలేక రాజేష్, పంకజ్‌లు చేరో వైపు పరుగులు తీశారు. సెక్యూరిటీ గార్డులు ఇద్దరూ రాజేష్ వైపు వెళ్లారు. దీంతో పంకజ్ రాయి తీసుకొని వారిపై వేశాడు. రెచ్చిపోయిన సెక్యూరిటీ గార్డులు పంకజ్‌ను పట్టుకొని చితక బాదారు. తీవ్రంగా గాయపడ్డ పంకజ్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పంకజ్ ఈనెల 2న మృతి చెందాడు. బంజారాహిల్స్ పోలీసులు ఆనంద్‌కుమార్, సంజీత్ తివారీలపై హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న సంజీత్‌కుమార్ తివారీ, ఆనంద్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మద్యంమత్తులో కారు నడిపి.. ప్రహరీని ఢీకొట్టి..

బంజారాహిల్స్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో కారు నడిపి ఓ ఇంటి ప్రహరీని ఢీ కొట్టిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాదాపూర్ హఫీజ్‌పేటకు చెందిన శివప్రసాద్, భరత్, శ్రీనివాస్, కృష్ణానగర్‌కు చెందిన అభిషేక్ స్నేహితులు. నలుగురూ కలిసి ఈనెల 3న కారులో యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్‌లో జరిగిన పార్టీకి హాజరయ్యారు. శివప్రసాద్, భరత్, అభిషేక్ మద్యం తాగారు. అనంతరం భోజనం చేసేందుకు మాదాపూర్‌కు వెళ్లారు. అక్కడి నుంచి అభిషేక్‌ను కృష్ణానగర్‌లో దించేందుకు కారులో బయలు దేరారు. శివప్రసాద్ కారు నడుపుతున్నాడు. అతివేగంగా వచ్చిన కారు జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 10లోని ప్లాట్ నెంబర్ 122 ప్రహరీని ఢీకొట్టారు. ప్రహరీ పూర్తిగా ధ్వంసం అయింది. సమాచారం అందుకున్న పోలీసులు నలుగురినీ అదుపులోకి తీసుకున్నారు. ఇంటి యజమాని వరప్రసాద్ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు శివప్రసాద్, భరత్, అభిషేక్‌లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్లారెడ్డిగూడలో నివసించే బొబ్బా రవికుమార్ భార్యతో కలిసి నివసిస్తున్నాడు. రవికుమార్ ఏడేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అమెరికాలో ఉన్న తన కుమార్తె డెలివరీ కోసం అతని భార్య మూడునెలల క్రితం అమెరికా వెళ్లింది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. అతని వద్దకు పని మనుషులు మాత్రమే వచ్చిపోతుంటారు. 3వ తేదీ అతను నైలాన్ తాడుతో హుక్‌కు ఉరేసుకున్నాడు. ఈ విషయం పనిమనుషులు అతని కుమార్తె బబితకు ఫోన్లో చెప్పారు. ఆమె తమ బంధువైన కూకట్‌పల్లికి చెందిన ఆదిత్యకు తెలియచేయటంతో అతను ఎల్లారెడ్డిగూడకు వచ్చాడు. ఈ మేరకు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి వద్దని .. యువతి అదృశ్యం

బోయిన్‌పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాలేజీకి వెళ్లిన ఓ యువతి అదృశ్యమై వారంరోజులుగా ఇంటికి తిరిగిరాని సంఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బోయిన్‌పల్లి ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం బోయిన్‌పల్లి నందమూరినగర్‌కు చెందిన యువతి (21) డిగ్రీ 3వ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో డిసెంబర్ 23న తాను కాలేజీకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్ళింది. సాయంత్రం తన ఫోన్ నుంచి తల్లికి ఫోన్ చేసింది. తనకు ఇప్పుడే పెళ్లి వద్దని, సంబంధాలు చూడవద్దని, తనకు క్యాంపస్ సెలక్షన్‌లో మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చిందని, తాను హాస్టల్‌లో ఉంటున్నాను అని తల్లితో ఫోన్‌లో చెప్పి ఫోన్ కట్ చేసింది. ఆ తరువాత తన ఫోన్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఆమె మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేయబడింది. అయితే కోపంతో ఉన్న తమ కుమార్తె బెదిరించడానికి స్నేహితుల ఇంటికిగాని బంధువుల ఇంటికి గాని వెళ్ళి ఉంటుందని, లేదా హాస్టల్‌లో ఉండి ఉంటుంది అని తల్లితండ్రులు భావించారు. వారం రోజులు గడిచినా ఆమె ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేయలేదు. దీంతో బంధువుల ఇంట్లో వెతికినా ఆమె ఎక్కడా కనిపించలేదని తెలిపారు. ఈ క్రమంలో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు గురువారం బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా రవాణా వ్యవస్థ బలపడింది

- ప్రొఫెసర్ ఎం.కోదండరాం


సమావేశంలో అభివాదం చేస్తున్న ప్రొఫెసర్ ఎం.కోదండరాం, రాజిరెడ్డి, మహమూద్, కోట నీలిమ, తదితరులు

రాంనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా రవాణా వ్యవస్థ బలపడిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆర్టీసీ ప్రాధాన్యం పెరిగిందని ప్రొఫెసర్ ఎం.కోదండరాం పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న ఆర్టీసీని అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కార్యాచరణ ప్రణాళిక చేపట్టబోతున్నారని తెలిపారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సికింద్రాబాద్, హైదరాబాద్ రీజియన్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కోదండరాం హాజరై మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమూద్, వైస్ చైర్మన్ జక్కుల మల్లేశం, అదనపు ప్రధాన కార్యదర్శి అబ్రహం మాట్లాడారు. ఆర్టీసీలోని వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి యూనియన్‌లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు చెల్లించాలని, వేతన సవరణ చేయాలని, ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలని, కొత్త నియామకాలు చేపట్టాలని కోరారు. కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, సీసీఎస్ బకాయిలు చెల్లించాలని, కార్మికులకు పీఎఫ్ డబ్బులు ఇవ్వాలని, ఉచిత బస్సు ప్రయాణం వల్ల జరుగుతున్న నష్టాన్ని ప్రభుత్వం ప్రతి నెలా చెల్లించాలని, వనభోజనాలు రద్దు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా నల్గొండ, సూర్యాపేటలో సీఎం, మంత్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ పెట్టిన ఫ్లెక్సీలను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.సత్యనారాయణరెడ్డి, ఆర్.డి.చంద్రశేఖర్, నాగన్నగౌడ్, తిరుమలేష్, జె.గోపాల్, అఫ్జల్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం కావాలి..

చార్మినార్: రాజ్యాంగ పరిరక్షణే అందరి ధ్యేయం కావాలని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. సిటీ కాలేజ్‌లో జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోదండరాం మాట్లాడుతూ నాగరిక జీవితం గడపాలంటే తప్పనిసరిగా రాజ్యాంగ సూత్రాలను పాటించాలన్నారు. రాజ్యాంగాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తేనే ఆర్థికాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ బాల భాస్కర్ మాట్లాడుతూ రాజ్యాంగంపట్ల, రాజ్యాంగంలోని కీలకమైన సాంకేతిక పదాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలనే సంకల్పంతో ఈ సదస్సు నిర్వహించామన్నారు. ప్రొఫెసర్ డా.కె.భాస్కర్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో తెలుగు రాష్ట్రాలకు చెందిన అధ్యాపకులకు ప్రొఫెసర్ కోదండరాం ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. ఉపసంచాలకులు డా.షహజాద్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీఆర్ చిత్రపటం దహనం

కాంగ్రెస్ మేనిఫెస్టోను కించపరచడంపై..



ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో కేటీఆర్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్ తదితరులు

తార్నాక, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మేనిఫెస్టోను కించపరుస్తూ... అది 420 అని మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో గురువారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో కేటీఆర్ చిత్రపటాన్ని దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చనగాని దయాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికాంలోకి వచ్చి నెల కూడా కాలేదని, పదేళ్లపాటు మంత్రిగా పనిచేసిన వ్యక్తి, అధికారం చేజారగానే మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వంపై విషం చిమ్మడం ఎంతవరకు సమంజసమని తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు పదేళ్ల పాటు కేసీఆర్‌కు అధికారాన్ని అప్పగిస్తే తెలంగాణ సంపదను కేసీఆర్ కుటుంబం పూర్తిగా దోచుకుందని ఆరోపించారు. కేటీఆర్ తన వైఖరి మార్చుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లాలని కుట్రలు పన్నితే, తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఘాటుగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ఓయూ ప్రెసిడెంట్ మెడ శ్రీను, మహేష్ గౌడ్, విజయ్, సుమన్, వీరేందర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంత్రి, సీతక్క జీవిత చరిత్రపై రాసిన కవితతో తయారు చేసిన ఫొటోను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సీతక్కకు ఆయన గురువారం బహూకరించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సీహెచ్ నిర్మలారెడ్డి, కార్టూనిస్ట్ శ్రీరామ్, బొమ్మ వెంకటేష్, ప్రణీత్ పాల్గొన్నారు. - కవాడిగూడ

కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి: మంత్రి సీతక్క

రాంనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రి సీతక్కను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టే విజయ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంత్రికి వివరించామని తెలిపారు.

చిక్కడపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్కను తెలంగాణ మున్నూరుకాపు యువజనసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరె దశరథం తదితరులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాభవన్‌లో సీతక్కను కలిసి మున్నూరుకాపుల సంక్షేమానికి సహకరించాలని, కోరారు. ప్రధానకార్యదర్శి మహేందర్, కిషన్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య

హైదర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేపీహెచ్‌బీ 6వ ఫేజ్ సాయి సరస్వతి అపార్ట్‌మెంట్స్‌లో ఈడుపుగంటి చిన సాంబశివరావు(65) నివసిస్తున్నాడు. గతంలో ప్రైవేటు ఉద్యోగం చేసి రిటైర్ అయ్యాడు. కొంతకాలం కోల్‌కతాలో కుమార్తె వద్ద ఉన్నాడు. 20 రోజుల క్రితం నగరానికి వచ్చి కేపీహెచ్‌బీలో ఒంటరిగా ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం వరకు సాంబశివరావు తలుపులు తెరవకపోవడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు అతడు రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ద్విచక్రవాహనం ఢీకొని వాచ్‌మన్..

హైదర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల సీబీసీఐడీ అపార్ట్‌మెంట్‌లో సంగారెడ్డి జిల్లా అంతెర్‌గాన్ గ్రామానికి చెందిన భూతలి బాలరాజు(41) వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల ఒకటో తేదీ రాత్రి 10 గంటల సమయంలో కిరాణా షాపునకు వెళ్లాడు. తిరిగి వస్తూ హైదర్‌నగర్ పోచమ్మగుడి వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం అతడిని ఢీకొట్టింది. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడు బాలరాజు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ..

హైదర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట రంగారెడ్డినగర్‌కు చెందిన ఆదెపు శైలజ(34) కేపీహెచ్‌బీ కాలనీలో నెక్సస్ ఫోరం మాల్ సమీపంలోగల ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. గురువారం ఉదయం జగద్గిరిగుట్టలో ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై కార్యాలయానికి వెళ్తోంది. కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శైలజను స్థానికంగాగల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడు..

పహాడీషరీఫ్ జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వేగంగా వచ్చిన లారీ ఓ బైక్‌ను ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ యూసుఫ్ జానీ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చాంద్రాయణగుట్ట నుంచి బైక్ (ఏపీ 29 ఏఆర్ 5053) పై పహాడీషరీఫ్ వైపు వెళ్తుండగా.. ఎర్రకుంట చౌరస్తా వద్ద గుంతల మయంగా ఉన్న రోడ్డులో వేగంగా వచ్చిన లారీ (ఏపీటీ 5487) ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బాలాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



మంత్రి సీతక్క నుంచి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు

ఉపాధ్యాయులకు సావిత్రిబాయి పూలే అవార్డులు

బౌద్ధనగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి బ్రాహ్మణబస్తీకి చెందిన మాథూర్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే అవార్డులను అందుకున్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క చేతులమీదుగా ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరి, ఉపాధ్యాయులు మీనాకుమారి, రేఖ, పవిత్ర, రెబ్కాక ప్రసాద్‌లు అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ భారతీయ ఓబీసీ సమైఖ్య జాతీయ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బీఎస్.రాములు, లయన్ డాక్టర్ ఆర్‌వీఎల్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- విజయ డెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ సాదం రమేష్

తార్నాక, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సమస్యల పరిష్కారానికి విజయ డెయిరీకి ఎండీగా నూతనంగా నియామకమైన ఇట్టం లక్ష్మి చర్యలు తీసుకోవాలని విజయ డెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ సాదం రమేష్ అన్నారు. ఈమేరకు గురువారం లాలాపేట్‌లోని విజయ డెయిరీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయ డెయిరీని నమ్ముకుని జీవిస్తున్న 1.5లక్షల రైతు కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని డెయిరీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రధానంగా రైతులకు పాల క్యాన్లు, మిషనరీలు, పశువుల దాన, మందులు సరైన సమయంలో అందించాలన్నారు. అదేవిధంగా గత 4 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పాల ఇన్సెంటివ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాడి రైతులను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్న రిటైర్డ్ అధికారులను తొలగించాలని కోరారు.



ప్రసంగిస్తున్న దీపక్ కుమార్ శ్రీవాత్సవ

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

చిలకలగూడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని పంజాబ్ నేషనల్ బ్యాంక్, జోనల్ ఆఫీసర్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ తెలిపారు. మెట్టుగూడ డివిజన్, విజయపురి కాలనీ, చిల్డ్రన్స్ పార్క్‌లో గురువారం పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర పేరిట కార్యక్రమం నిర్వహించారు. బ్యాంక్ ఆఫీసర్ శ్రీవాత్సవ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్, పీఎం విశ్వకర్మ, సురక్ష బీమాయోజన తదితర పథకాల గురించి వివరించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సికింద్రాబాద్ విభాగం నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సర్కిల్ హెడ్ ఎన్.ఎస్.వి.పి.ప్రసాద్, సికింద్రాబాద్ సర్కిల్ హెడ్ బి.వి.నరేష్, వివిధ బ్రాంచ్‌ల ప్రతినిధులు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. 2047వ సంవత్సరానికల్లా పేదలు లేని భారత్‌ని తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



కేంద్రమంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న మురళీధర్ తదితరులు

కేంద్రమంత్రికి వినతి

చిలకలగూడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఏడవ వేతన సంఘంలో అవకతవకలు సవరించి రైల్వే స్టేషన్‌మాస్టర్లకి న్యాయం చేయాలని ఆల్ ఇండియా రిటైర్డ్ స్టేషన్‌మాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మంత్రి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపడతానని హామీ యిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మురళీధర్, ఎన్.ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.



యూనియన్ క్యాలెండర్, డైరీ అందజేత

దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ అకౌంట్స్ బ్రాంచ్ కార్యదర్శి చింతకుంట రామకృష్ణ ఆధ్వర్యంలో లాలాగూడ అసిస్టెంట్ వర్క్‌షాపు అకౌంట్స్ ఆఫీసర్ జగదీష్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి యూనియన్ క్యాలెండర్, డైరీ అందజేస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

- చిలకలగూడ,ఆంధ్రజ్యోతి



లలితానగర్‌లో పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్పస్వాములు

అయ్యప్పస్వాముల పాదయాత్ర

బౌద్ధనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): లలితానగర్, అంబర్‌నగర్‌కు చెందిన శ్రీధర్మశాస్త్ర సన్నిధానం 30వ వార్షికోత్సవం పురస్కరించుకుని అయ్యప్పస్వాములు భారీ ఊరేగింపును నిర్వహించారు. గురువారం లలితానగర్ శివాలయంలో గురుస్వామి రాజు ఆధ్వర్యంలో గురుస్వాములు వినోద్‌కన్నా, శ్రీకాంత్, నర్సింగ్, నవీన్, జగన్, మహేష్, గోపీ సమక్షంలో సుమారు రెండువందల మంది స్వాములు ఇరుముడిని కట్టుకుని ఆలయం నుంచి కాచిగూడ వరకు పాదయాత్ర చేశారు. సన్నిధానం నెలకొల్పి ముప్పై సంవత్సరాలు పూరైన సందర్భంగా అన్నదాన కార్యక్రమంతోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామని గురుస్వాములు తెలిపారు.

పార్కింగ్‌కు స్థలమేదీ?

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు

రాంగోపాల్‌పేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జనరల్‌బజార్, రాణీగంజ్ అనగానే వ్యాపర కేంద్రాల నిలయం గుర్తొస్తుంది. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో, వందల కోట్ల రూపాయల వ్యాపారం జరిగే ప్రాంతమిది. అలాంటి ఈ ప్రాంతంలో ఏ రోడ్డు చూసినా ట్రాఫిక్ తిప్పలు, వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఈ ప్రాంతంలోని ప్రధాన రోడ్లతోపాటు అంతర్గత రహదారులన్నీ ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్‌లతో నిండిపోతున్నాయి. దీన్ని నియంత్రించాల్సిన ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకుండా కేవలం చలాన్‌లకే పరిమితమవుతున్నారు. దీంతో ప్రతి రోజు వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.

వ్యాపార సంస్థలకు పార్కింగ్ ఏది ?

అసలు ఏ నివాసానికైన, ముఖ్యంగా వ్యాపార సంస్థలకు జీహెచ్ఎంసీ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చే ముందు ఆ భవనానికి పార్కింగ్ వసతి ఉందా లేదా అని చూడాలి. పార్కింగ్ వసతి లేకపోతే ఆ భవనంలో వ్యాపార సంస్థలకు అనుమతి ఇవ్వకూడదు. కానీ జీహెచ్ఎంసీ కేవలం ధనార్జనే లక్ష్యంగా పనిచేస్తూ, కేవలం లైసెన్స్ ఫీజులు, ట్యాక్సుల వసూళ్ళపై దృష్టి పెడుతూ ప్రజల సౌకర్యాలను గాలికొదిలేస్తున్నారు. జనరల్ బజార్, సుభాష్ రోడ్డు, హిల్స్ స్ట్రీట్, డిస్టిలరీ రోడ్డు, పాన్‌బజార్, ధనబజార్, రంగ్రేజ్ బజార్, ప్యారడైజ్ హోటల్ తదితర ప్రాంతాలలో పలు వ్యాపార సంస్థలు ఉన్నాయి. ప్రతి రోజు ఆయా ప్రాంతాలలో నిత్యం వేలాదిగా వాహనాలు వచ్చిపోతుంటాయి కోట్లాది రూపాయల వ్యాపారాలు నిర్వహించే వ్యాపార సంస్థలకు ఎలాంటి పార్కింగ్ వసతి లేదు. దీంతో ఆయా వ్యాపార సంస్థలకు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్క్ చేస్తున్నారు. పాన్‌బజార్‌లోనైతే ఆటోలు, డీసీఎంలు, లారీలు ఇష్టారాజ్యంగా పార్క్ చేయడమే కాక రోడ్డుపై వాహనలాను అడ్డుతొలగమని చెప్పేవారితో గొడవకు దిగుతున్నారు. రహదారులపై వాహనాలను ఇష్టారాజ్యంగా పార్క్ చేయడం వల్ల రోడ్లు కుచించుకుపోతున్నాయి.



పాన్ బజార్‌లో ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్



ప్యారడైజ్ వద్ద ఇష్టారాజ్యంగా పార్కింగ్

ఈ రోడ్లపై అధికారులు దృష్టి సారించాలి



ప్రధాన రహదారులపై ఉండి చలాన్లు రాసే ట్రాఫిక్ పోలీసులు అంతర్గత రహదారులపై కూడా దృష్టి పెట్టాలి. దుకాణాలకు వచ్చే కొనుగోలుదారులతో అడ్డగోలు పార్కింగ్ చేయించే వ్యాపారస్తులకు నోటీసులు ఇచ్చి వారిపై చర్యలు చేపట్టాలి. ఇష్టానుసారంగా పార్కింగ్ నిర్వహించకుండా పాదచారులకు నడవడానికి కూడా స్థలం లేకుండా తమ వాహనాలను పార్క్ చేసే వాహనదారులపై కఠిన చర్యలు చేపట్టాలి.

- నర్సింగం సతీష్, చుట్టాల బస్తీ నివాసి

ప్రజలు అవగాహనతో మెలగాలి



ఇరుకైన రహదారుల్లో వాహనాలను పార్కు చేయవద్దనే అవగాహన ప్రజల్లో ఉండాలి. ఎన్నిసార్లు చలాన్లు రాసినా ఫలితం లేకుండా పోతుంది. ఈ ప్రాంతం వ్యాపార ప్రాంతం. ఇక్కడ పార్కింగ్ చేసే స్థలం కొరత ఉన్నది. దీనితో సమస్య ఉత్పన్నమవుతుంది. సమస్య పరిష్కారానికి జీహెచ్ఎంసీ తగిన చొరవ తీసుకోవాలి. పార్కింగ్ స్థలం లేకుంటే వ్యాపార సంస్థలకు ట్రేడ్ లైసెన్స్‌లు ఇవ్వకుంటే సగం సమస్య తగ్గుతుంది.

- పి.శంకర్, ఇన్స్‌పెక్టర్, మహంకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

ఇలా రోడ్లను ఆక్రమించి పార్కింగ్ చేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు మాత్రం పట్టించుకోవడంలేదు.

పెద్ద పెద్ద వ్యాపార సంస్థల ముందే కాక వాణిజ్య సముదాయాల వద్ద ఇష్టానుసారంగా వాహనాలను పార్క్ చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు.. ఇందులోని మతలబు ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి

- ఏసీపీ శంకర్‌రాజు

సికింద్రాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకుని, పెద్దయిన తర్వాత వాటిని పాటించాలని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు సూచించారు. నగరంలోని వివిధ పాఠశాలల, కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లకు గురువారం సికింద్రాబాద్ బైసన్ పోలో గ్రౌండ్‌లో ట్రాఫిక్ అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఏఎస్ఐ మొహమ్మద్ ఆదిల్, సిద్దాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ రహదారులపై విద్యార్థులు క్రమశిక్షణతో వ్యవహరించాలని చెప్పారు.

రోడ్డు దాటేటప్పుడు అనుసరించవలసిన అంశాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ గురించి ఆయన వివరించారు. యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ట్రిపుల్ రైడింగ్, ఓవర్‌స్పీడ్, డేంజరస్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని, లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్టరీత్యా నేరమని వివరించారు. సమాజంలో జరిగే నేరాల పట్ల కూడా యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. క్యాంప్ కమాండెంట్ ఆనంద్‌కుమార్, డిప్యూటీ కమాండెంట్ మీను తోమర్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ కేడెట్లనుద్దేశించి మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

భక్తిశ్రద్ధలతో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

బోయిన్‌పల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముడి పూజిత అక్షింతలను బోయిన్‌పల్లికి చెందిన హిందూవాహిని రామభక్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన సతీమణి విద్యావతితో కలిసి ఇంటింటికీ వెళ్ళి అక్షింతలను అందజేశారు. వాటిని ఇంట్లో పెట్టి పూజలు చేసుకోవాలని సూచించారు. ఈనెల 22న అయోధ్యలో జరిగే పూజల సందర్భంగా అక్షింతలకు పూజలు చేసి తలపై వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం కొనసాగుతున్నంతసేపు ఆయా కాలనీలలో జై శ్రీరామ్, జై జై శ్రీరామ్ నామస్మరణలతో మారుమ్రోగిపోయాయి. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాసరెడ్డి, ఉమేష్ బాబు, రమేష్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బోయిన్‌పల్లిలోని కాలనీలలో అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేస్తున్న పాండుయాదవ్

కేటీఆర్‌కు కార్పొరేటర్ అభినందనలు



తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావుకి మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్చం అందజేశారు.

- చిలకలగూడ, ఆంధ్రజ్యోతి

డీసీపీకి సత్కారం



ఖమ్మంకు బదిలీపై వెళుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్

- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి

సివరేజీపనులు పరిశీలించిన కార్పొరేటర్

బౌద్ధనగర్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో గొల్లపుల్లయ్య బావిలో జరుగుతున్న సివరేజీ పైపులైన్ నిర్మాణ పనులను కార్పొరేటర్ సామల హేమ అధికారులతో కలిసి పరిశీలించారు. పనులను తొందరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జలమండలి మేనేజర్ అన్విత్, జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో కార్పొరేటర్ సామల హేమ

ఇన్‌స్టాగ్రాంలో పరిచయం ..

యువతికి వేధింపులు

అడ్డగుట్ట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రాంలో పరిచేయం చేసుకుని యువతికి అసభ్యకరమైన సందేశాలు పంపిస్తు వేధిస్తున్న వ్యక్తిని తుకారాంగేట్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన హరీష్(22) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండేళ్ల నుంచి ఈస్ట్ మారేడుపల్లికి చెందిన యువతి ఇన్‌స్టాగ్రాంలో పరిచయం చేసుకున్నాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. యువతికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఇన్‌స్టాగ్రాంలో పోస్టు చేస్తానని బెదిరించడం మొదలుపెట్టాడు. నిత్యం అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టడంతో యువతి భయాందోళనకు గురై వెంటనే తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎట్టకేలకు యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించడంతో నిజమేనని విచారణలో వెల్లడైంది. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాంగ్రెస్ అభయహస్తం పథకాలను ..

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

- సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్

తార్నాక, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అభయహస్తం పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. ప్రజా పాలన దరఖాస్తు కేంద్రాల సందర్శనలో భాగంగా కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్‌తో కలిసి గురువారం అనిల్ కుమార్ యాదవ్ లాలాపేట్‌లోని వార్డు ఆఫీస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల పథకాలను ఖచ్చితంగా అమలు చేస్తుందని, అర్హులైన ప్రతిఒక్కరూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీలకు దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్ యాదవ్, ప్రవీణ్‌లాల్, అమర్నాథ్‌గౌడ్, బ్రహ్మాజీ, గణేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



లాలాపేట్‌లోని ప్రజా పాలన దరఖాస్తు కేంద్రంలో సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఆదం సంతోష్ కుమార్ తదితరులు

సికింద్రాబాద్‌లో మహారాష్ట్రవాసి అదృశ్యం



వైభవ్‌బాబాజీ జాదవ్

అడ్డగుట్ట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పని నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన వైభవ్ బాబాజీ జాదవ్(40)తో పాటు మరో ముగ్గురు కలిసి వారం రోజుల క్రితం హైదరాబాద్‌లో పనిచేసేందుకు వచ్చారు. తిరిగి పనిముగిసిన తరువాత డిసెంబర్ 30న తిరిగి మహారాష్ట్ర వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే ముగ్గురితో కలిసి బుకింగ్ కౌంటర్ వద్ద టికెట్ తీసుకుని బాబాజీ జాదవ్ బాత్‌రూంకు వెళుతున్నానని చెప్పి వెళ్లిపోయాడు. తిరిగి ఎంతసేపటికీ రాకపోవడంతో ముగ్గురు స్నేహితుల్లో ఒకరు బాబాజీ జాదవ్ భార్య తానీషా వైభవ్ జాదవ్‌కు సమాచారం ఇచ్చారు. బుధవారం హైద్రాబాద్‌కు చేరుకున్న ఆమె నేరుగా గోపాలపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుడే పెళ్లి వద్దని చెప్పి..

యువతి అదృశ్యం

బోయిన్‌పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కాలేజ్‌కి వెళ్ళిన ఓ యువతి అదృశ్యమై వారంరోజులుగా ఇంటికి తిరిగిరాని సంఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బోయిన్‌పల్లి ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం బోయిన్‌పల్లి నందమూరినగర్‌కు చెందిన యువతి (21) డిగ్రీ 3వ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో డిసెంబర్ 28న తాను కాలేజ్‌కి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్ళింది. సాయంత్రం తన ఫోన్ నుంచి తల్లికి ఫోన్ చేసింది. తనకు ఇప్పుడే పెళ్లి వద్దని, సంబంధాలు చూడవద్దని, తనకు క్యాంపస్ సెలక్షన్‌లో మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చిందని, తాను హాస్టల్‌లో ఉంటున్నాను అని తల్లితో ఫోన్‌లో చెప్పి ఫోన్ కట్ చేసింది. ఆ తరువాత తన ఫోన్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఆమె మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేయబడింది. అయితే కోపంతో ఉన్న తమ కుమార్తె బెదిరించడానికి స్నేహితుల ఇంటికిగాని, బంధువుల ఇంటికి గాని వెళ్ళి ఉంటుందని, లేదా హాస్టల్‌లో ఉండి ఉంటుంది అని తల్లితండ్రులు భావించారు. వారం రోజులు గడిచినా ఆమె ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేయలేదు. దీంతో బంధువుల ఇంట్లో వెతికినా ఆమె ఎక్కడా కనిపించలేదని తెలిపారు. ఈ క్రమంలో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు గురువారం బోయిన్‌పల్లి పోలీసులకు పిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేరాల నియంత్రణకు ఆర్‌పీఎఫ్ కృషి

693 మంది అరెస్టు... రూ.1.97 కోట్ల రైల్వే ఆస్తి స్వాధీనం

హైదరాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) నేరాల నివారణకు నిరంతరం కృషి చేస్తూనే అక్రమార్కులను అరెస్టు చేసి ప్రయాణికుల్లో విశ్వసనీయత పెంచింది. రైళ్లు, రైల్వేస్టేషన్లలో నేర కార్యకలాపాలను విజయవంతంగా నియంత్రించినట్టు అధికారులు పేర్కొన్నారు. గత ఏడాది రైల్వే వస్తువులు అపహరించిన, ఆస్తులను ఆక్రమించిన 693 మందిని అరెస్టు చేసి రూ.1.97 కోట్ల రైల్వే ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. నడుస్తున్న రైళ్లపై రాళ్లు రువ్వినందుకు 401 కేసులు నమోదు చేసి 327 మందిని అరెస్టు చేశారు. 161 మందిని అరెస్టు చేసి 23.09 కోట్ల విలువైన 3,239 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే రిజర్వేషన్ టిక్కెట్లను అనధికారికంగా విక్రయించినందుకు 261 మందిని అరెస్టు చేసి రూ.2,30,59,680విలువ చేసే 8770 టిక్కెట్లను రైల్వే రక్షణ దళం స్వాధీనం చేసుకుంది. టికెట్ లేకుండా రిజర్వేషన్ బోగీలో ప్రయాణించిన 702 మంది నుంచి రూ.1.47లక్షల జరిమానా వసూలు చేసినట్టు తెలిపారు. ఫుట్‌బోర్డ్‌లపై ప్రయాణించినందుకు 627 మందిని పట్టుకున్నారు. టిక్కెట్ లేకుండా ప్రయాణించిన 1903 మంది వద్ద రూ.1.36 లక్షల జరిమానా వసూలు చేశారు. రైళ్లలో ప్రమాదకరమైన పేలుడు పదార్థాలను తీసుకెళ్తున్న 19 మందిని అరెస్టు చేశారు. రైల్వే ప్రాంగణంలో ప్రయాణికుల వస్తువులను దొంగిలించిన 454 మందిని అరెస్టు చేసి 9.36 కోట్ల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

జన్‌సంఘ్ నాయకుడు హనుమంతరావు మృతి

కార్వాన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ సీనియర్ నాయకులు, జన్‌సంఘ్ నాయకులు ఆకుల హనుమంతరావు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్ తదితరులు సంతాపం తెలిపారు. నేడు లంగర్‌హౌజ్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరగనున్నట్లు కార్వాన్ బీజేపీ కన్వీనర్ గోవర్ధన్ తెలిపారు.

కిరాణా షాపుకెళ్లి వస్తుండగా..

ద్విచక్రవాహనం ఢీకొని వాచ్‌మన్ మృతి

హైదర్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల సీటీసీఐడీ అపార్ట్‌మెంట్‌లో సంగారెడ్డి జిల్లా అంతెర్‌గాన్ గ్రామానికి చెందిన భూతలి బాలరాజు(41) వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల ఒకటో తేదీ రాత్రి 10 గంటల సమయంలో కిరాణా షాపునకు వెళ్లాడు. తిరిగి వస్తూ హైదర్‌నగర్ పోచమ్మగుడి వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం అతడిని ఢీకొట్టింది. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడు బాలరాజు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.